# బల్లకట్టు
# బెల్లపావకాయ

కొత్త చింతకాయలు తింటే డాక్టరుకి డబ్బొస్తుంది. మనకు జబ్బొస్తుందీ. మా ఊరుకాలవగట్టు పొడవునా చింతచెట్లే.

చీకూ చింతా లేకుండా ఎవరూ జీవించలేరు. కాలవగట్టుమీద చింత చెట్లుండాల్సిందే. చింతచెట్లక్రిందనుంచి బస్సులు రిక్షాలు మనుష్యులూ తిరగాల్సిందే.

కాలవ వుండాలి. (మా ఊరికో కాలవుంది) కాలవమీద బల్లకట్టు వుండాలి.

కాలవకి రెండువైపులావున్న ఊళ్ళకి వంతెన లేకపోతే బల్లకట్టే ప్రాణం.

మా కాలవ నరసాపురం కాలవ.

మా ఊరు మార్టేరుకి మైలున్నర.

కాలవ బల్లకట్టు లేకపోతే ఊరికి అందంలేదు.

నాకు బల్లకట్టంటే ఇష్టం.

మా వూరి బల్లకట్టు నాకు చిన్ననాటి నేస్తం.

ఆ బల్లకట్టుమీద కూర్చుని నీళ్ళల్లో కాళ్ళాడిస్తూనో వూసులాడుకునేవాళ్ళం. పోసుకోలు కబుర్లు, కథలూ, కాకరకాయలూ చెప్పుకునేవాళ్ళం

ఆ కాలవ నీళ్ళు ప్రవాహం. వాటి మిలమిలలు ఆకాలవమీదకు వంగి నీడలు చూసుకొంటున్న చెట్లు. ఆ గట్లమీద పరుగులెత్తి చెట్టాపట్టాలు వేసుకుతిరిగి మేము ఆడుకున్నఆటలు పోట్లాటలు గుర్తే.

ఆ కాలవ ఎండిపోయినప్పుడు యిసుకలో ఎన్నో పిచ్చుకగూళ్ళు కట్టాం. చలమలు తవ్వి లిక్కిలిక్కి చెంబుతో నీళ్ళు తెచ్చుకునేవాళ్ళం.

కాలవ నిండుగావున్నప్పుడు భయంవేసేది.

నిజమే.

కాలవ పూర్తిగా ఎండిపోయినప్పుడు ఎవరో గొప్పవాడు హఠాత్తుగా పేదవాడైపోయినట్లు వున్నదంతా వూడ్చిపెట్టుకుపోతే ఎంతదిగు

లుగా భయంకరంగా వుండేదో ఆ ఎండిన కాలవ చూస్తున్నప్పుడు అలా అనిపించేది.

మేవు ఆ ఎండిన కాలవమధ్యలో తడిఇసుకలో ఎన్నిరకాల ఆటలు ఆడవచ్చో అన్నీ ఆడిద తలలు. బట్టలు తడుపుకుని వొడ్డిగుమ్మంలోంచి దొంగల్లా ఇళ్ళల్లోకి జొరబడేవాళ్ళం.

ఎన్ని మొట్టికాయలు. వీపుమీద అప్పచ్చులు తినకుండా వెళ్ళమారింది బాల్యం!

ఆ మొట్టికాయలు. వీపుమీద గుద్దులు మోకాళ్ళమీద చింతబరికితో దెబ్బలూ, గొంటిపిక్కాలూ, గిల్లుటూ ఆవేవీయిప్పుడు జ్ఞాపకంలేవు

ఇప్పుడల్లా జ్ఞాపకముండేది. ఆబల్లకట్టూ దానిమీద మేంవేసిన చిందులూ.... బెల్లపావకాయ. అబ్బ, ఈ బెల్లపావకాయ జ్ఞాపకమొచ్చిందేమిటి యిప్పుడు?

బూరిల్లా వాచిపోయిన బుగ్గలు. చీమిడిముక్కూ కళ్ళకలకల్తో మూసుకు పోయిన చీకిరీకళ్ళూ అప్పుడు నేనెలా వుండేవాన్నో వూహించుకుంటే నాకు కళ్ళనీళ్ళు తిరుగుతాయి. వయసుమీదకు వరువం తేకపోతే కాలం కళ్ళకు మత్తుమందు జల్లకపోతే. ఈ వయసుతెచ్చిన సొగసుతో నేను మా బావ ఒళ్ళోవచ్చి వాలానుకాని — ఈచీకిరికళ్ళ, చీమిడిముక్కూ రాక్షసిని ఎవరు పెళ్ళాడేవారు? ఎవరూ పెళ్ళాడేవారుకాదు. మేనరికాల్లో బ్యూటీకి దే డోంట్ కేర్. సో ఐలైక్ మై బావగారు. కంట్రీగకల్ని పెళ్ళాడినందుకు ఎప్పుడూ విచారించలేదు. మేన మావఁ కూతురిదగ్గరున్న లిబర్టీ. ఫ్రీడం చనువూ సరదా మరో కొత్తగుంట దగ్గర (నాకు బెల్లపావకాయంటే యిష్టం అని చెప్పాను విశాఖపట్నం అంటేషూరా నాకిష్టమేఁ) కట్నం తెస్తుందనుకోండి. తెచ్చినా ఆ అప్యాస్నేహమూ దప్పట్టి కొనుక్కూ తెచ్చుకొన్నవే ఎగ్జాట్లీ!

దబ్బెట్టి మొగుళ్ళను కొనుక్కు తెచ్చుకున్న అమ్మాయిలంతా మేనమావఁ కూతుళ్ళ కాలిగోటికుపోలరు. బజార్లో మొగుడ్ని కొనుక్కొని పిల్లల్ని కని పైగా మాట్లాడొస్తోంది. అని చెప్పవచ్చు ఎగ్గాట్లి

మేనమావఁకొడుకైతే మొగుడు ఆఫీస్‌బాయ్‌లా మనచేతిలో వుంటాడు. పరాయి సంబంధమైతే అంతా అతికీ అతకక కొత్త కొత్తగా వచ్చివచ్చిగా వుంటుంది. ఇద్దరు ముగ్గురుబిడ్డల తల్లికికూడా పగలు మొగుడ్ని చూస్తోంటే పరాయి పురుషుడులా కనపడొచ్చు అర్ధనారీశ్వరుడులా అవుపడ్డు.

బెల్లపావకాయగురించి చెబుదామనుకుని పెళ్ళిసంబధాల గొడవల్లో పడిపోయేను. మేనరికాల బెల్లపావకాయ రుచి వుంది కాబోలు నేనేదైనా సీరియస్‌గా చెబుదామనుకుంటే మధ్యలో బెల్లపావకాయ వచ్చినా ప్లానంతా పాడుచేస్తుంది.

బెల్లపావకాయంటే నాకిష్టమన్నాను గదా!

బల్ల కట్టంటే కూడా నాకిష్టమేఁ

ఎప్పుడూ ఆకుపచ్చరంగు సిల్కుగౌను తొడగమని ఏడిచేదాన్ని. భుజాల క్రిందకు దిగిపోయిన ఆకుపచ్చ సిల్కుగౌను ఒకటుండేది నాకు మోకాళ్ళకిందకు దిగిపోయిన లాగుతొడుక్కుని ఆ గౌను వేసుకుని ఒక చేత్తో చందనపు బొమ్మను పట్టుకుని. బెల్లపావకాయ పెచ్చుపీక్కుంటూ. మా గుమ్మంముందు అరుగుక్రింద కొబ్బరిచెట్టునీడను టైలరు దగ్గరనుంచి తెచ్చిన రంగుల గుడ్డపీలికలు. ముచ్చె కాయితాలు. రంగుల పూసలు. సబ్బు పెట్టె. పాతసీసాలు. విరిగిపోయిన వినాయకుడి మట్టిబొమ్మ పెంకులతో- రాళ్ళతోకట్టిన బొమ్మరింట్లో వుత్తుత్తి అన్నాలు వొండుకుని కొబ్బరి పుచ్చెలతోనూ, టెంకాయ చిప్పలతోనూ లక్క పిడతలెట్టి ఆడుకునే

దాన్ని. ఆ ఆవకాయ పెచ్చు వున్నంతసేపూ చీకుతూ ఆడుకుని అక్కడే నిద్రొచ్చి నేను కట్టుకున్న బొమ్మరింట్లో నా ఆటవస్తువులన్నీ నేలమీద అలాగే వుండగా నిద్రపోయేదాన్ని.

ఆ బొమ్మరింట్లో వుత్తుత్తి అన్నాలు వొండితిని పడుకున్న ఆ దశలో ఇన్ని కన్నీళ్ళూ, ఇన్ని బాధలూ, ఇన్ని కష్టాలూ ఎరగం: ఇంత దొంగ రాస్కెల్సు ప్రపంచంనిండా వున్నారని తెలీదే.

బొమ్మవిరిగితే ఏడిస్తే ఇంకో బొమ్మ తెచ్చిఇచ్చేవారు. ఇప్పుడు బొమ్మ పారేసుకుంటే ఆలోటు ఎవరూ భర్తీ చెయ్యలేరు.

అవును - అప్పుడు నేను ఆడుకున్ననా బొమ్మల పెట్టి నా చెక్క బొమ్మలు, నా ఆటవస్తువులు నా ప్రాణాధికాలు. అవన్నీ ఇప్పుడెక్కడు న్నాయి ?

ఆ బొమ్మలు ఆ రంగుల గుడ్డపేలికలు అన్నీ మా వూళ్ళో పుట్టింట్లో వదిలేసి మొగుడితో లేచొచ్చేశానా?

మావూళ్ళో ఒక టైలరుండేవాడు. వాడు పిల్లల్ని ప్రేమించేవాడు. కుట్టవలసిన క్రొత్త గుడ్డల్ని ద్వేషించేవాడు.

అందరి బట్టలూ గూడలే. పొట్టి, పొడుగూ వొదులూ, బిగుతూ ఏదో వొకటి తిన్నగా వచ్చినా కుట్టేవాడు కాదు.

కాలజ్ఞానం బొత్తిగాలేదు. స్వాములారు కావలసినవాడు. అయినా అప్పుడా టైలరు కుట్టిన ప్రతీ క్రొత్త గౌను పరికిణీ చొక్కా ఎంత సంతోషం కలిగించేదో తల్చుకుంటే, ఇప్పుడూ ఎంతఖరీదైనా నవనాగరి కపు దుస్తులు వేసుకున్నా, ఆసుఖం ఆ సంతోషం వేరు. ఈ దర్జాలలో ఆ సుఖాన్ని పోల్చుకుందుకు ఎంత మాత్రం వీల్లేదు.

అప్పుడుతిన్న ఆ బెల్లపావకాయరుచి డబ్బుతో కొంటే వొస్తుందా సార్?

బెల్లపావకాయ్ కాదు.

జీళ్ళు, తాటిముంజలు, బెల్లపుపాకం, అరిసెలు, మినప సున్నుండలు, పూతరేకులు యివేకాదు ఆఖరికి వుప్పులో వూరేసిన నిమ్మకాయ డొక్కకాని, మాగాయ ముక్కగాని, ఆఖరికి పెరుపధి మజ్జిగలో తడిపిన మాగాయ టెంకయినాసరే దేనిరుచి దానిదే.

ఏవయసులోనైనా దేనిరుచిదానిదే- బైగాడ్ చెప్తున్నాను.

ఇక బెల్లపావకాయ మాటెత్తను.

అద్దరివారి నిద్దరికి ఇద్దరివారి నద్దరికి జేర్చుట అదెంత భాగ్యం!

ఆ బల్లకట్టు ఎంత పుణ్యం చేసుకుందో....

మా నాన్న యించుకంత కోపిష్టి - అతనికి బల్లకట్టు కావలసొచ్చినప్పుడల్లా అతను యివతలుంటే అది అవతలుండేది.

వర్షం కురుస్తూంటే గబగబా వస్తే గెడ వదిలేసి బల్లకట్టు సుబ్బన్న ఏచెట్టుకిందోవెచ్చగా చుట్ట కాల్చుకుంటూ వుండేవాడు.

చెప్పానుగా మావూరు మార్టేరుకి మైలున్నర- కాలవకి రెండువేపులా వుందని.

ఇవతల పంచాయతీ ఆఫీసు, కరణం, మునసబు, చుట్టలకొట్టు బడ్డీ దుకాణం, కాఫీహోటలు, చెరువు, లైబ్రరీ, దుకాణం, సైకిలుషాపు వుండే అవతల గట్టున దేవాలయం, సారాకొట్టు, చాకలిరేవు, పురోహితుడు, రైతులు, కూలీ నాలీ వున్నారు.

ఆవైపుకు వెళితే యీవైపున పనుంటుంది. ఇటొస్తే మళ్ళీ అటు వెళ్ళాలి.

జీవితమంటే యిటూ- అటూ —

కాలవ ఎండిపోవడం మళ్ళీ కాలవరావడం- పడవలూ పడవ పాటలూ క్రొత్తనీరూ క్రొత్తనీట్లో కొట్టుకొచ్చే శవాలూ యివే కబుర్లు మా కెంతసేపూ.

నేను చిన్నప్పుడు బల్లకట్టు గెడెయ్యటంకూడా నేర్చుకున్నా.

ఓసారి నేనూ మా వారూ బల్లకట్టు దాటుతున్నాం. ముసిలి అని ఓడుండేవాడు మా వూళ్ళో. వాడు నామీద మీదకొచ్చి-

"బెల్లపావకాయ చీకే అమ్మడు నువ్వే నా తల్లి" అని ఆప్యాయంగా అడిగాడు.

మా వారు యాంగ్రీ అగ్నిహోత్రుడైపోయారు వాడిమీద

ఈ సీవిండి ముక్కు పిల్లనినా నెత్తుకుని మోశా బాబూ! అని కాలవలోకి వుమ్మేసి చుట్ట నోట్లో మరో పక్కకి మార్చుకున్నాడు నిర్లిప్తంగా

"నీకు తెలీదు ముసిలీ. అప్పుడు మనింటికి సుబ్బారావని టైఫాయిడ్ జ్వరంవచ్చి యింత పొట్టేసుకుని కాళ్ళు పుల్లల్లా సన్నగా వో అబ్బాయి రాలా నువ్వు చీకట్లో సాయం వెళ్ళే వాడివి మా మేనత్త గారబ్బాయని. ఆయనేయీయన, అని ముసిలికి చెప్పాను కావాలనె.

"తవరా బాబూ గుర్తుంది! గుర్తుంది! అని మెరిసే కళ్ళతో, చూశాడు వాడు. రూపాయిచ్చాను నేను మా వార్ని దౌస్ చేద్దామనే వుద్దేశంతో.

అప్పుడు ఢిల్లీలో ఉద్యోగం చేస్తున్నందున వారు చాలా ఇన్స

ల్టింగ్‌గా ఫీలయారు. వొకడర్టీ ముసలిగాడి ముందులోకువైనందుకు నాతో మూ।డ్రోజులు మాటాడలేదు మాఇంటిమగవారు.

అది మా బిల్లకట్టు తగూ—

అయినా ఐడోంట్ కేర్:

మావూళ్లో మా బిల్లకట్టు ముసిలిని ఇన్సల్ట్ చేస్తే మావాళ్లైతే మా।త్రం ఐ డోంట్ లైకిట్।

ముసిలీ- ఆ బిల్లకట్టుమీద నీ చంకెక్కి- బెల్లపావకాయ చీకే చీమిడిముక్క-మ్మాయిని నేనే .. నేనే ... నేనే।